సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 28 । ఆగస్టు । 2023



బడి.. భవితకు బాసటగా

విద్యార్థుల భవితతో పాటు పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న ఆ గురువులను జాతీయస్థాయి ఉత్తమ పురస్కారం వరించింది. 8లో▸



200కు పైగా నామినేషన్లు వేస్తాం..

అసెంబ్లీ ఎన్నికల్లోపు బోథ్‌ను డివిజన్ చేయకుంటే రెండు వందలకు పైగా నామినేషన్లు వేస్తామని డివిజన్ సాధన సమితి సభ్యులు స్పష్టం చేశారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/23.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



సంతోష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఎదులాపురం: భీంపూర్ మండలం నిపాని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సంతోష్ కుమార్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికవడం జిల్లాకే గర్వకారణమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సంతోష్‌కుమార్‌ను ఎమ్మెల్యే ఆదివారం సన్మానించారు. ఇందులో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, శ్రీధర్‌బాబు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సంతోష్‌కుమార్‌ను సాయివైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రవికిరణ్ మాట్లాడారు. భీంపూర్ మండలం నిపానికి చెందిన ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్ జాతీయస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నవీన్, మహేందర్, శ్రీనివాస్, ఆశన్న, ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

12 మంది కాంట్రాక్ట్ టీచర్ల క్రమబద్ధీకరణ

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో కాంట్రాక్ట్ టీచర్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం వీటికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మూడు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు(రెండు బాలికలు, ఒకటి బాలుర) ఉన్నాయి. ఇందులో తొమ్మిది మంది మహిళ, ముగ్గురు పురుష ఉపాధ్యాయులు 16 ఏళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వులు రావాల్సి ఉందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లోకి అశ్విన్ కుమార్

ఎదులాపురం: బీజేపీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జిల్పెల్లి అశ్విన్‌కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేశారు. ఆయనకు ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'ఉన్నతి' శిక్షణ

ఎదులాపురం: ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఉపాధ్యాయులకు 'ఉన్నతి' శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు, హిందీ, గణితం సబ్జెక్టుల ఉపాధ్యాయులకు స్థానిక వివేకానంద బీఎడ్ కళాశాలలో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు సత్ఫలితాలు ఇవ్వడంతో, ఉన్నత స్థాయిలో ఉన్నతి శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టుకు సంబంధించి 6 నుంచి 10వతరగతి వరకు టెక్స్ట్‌బుక్స్‌తో విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

'చలో మైదాన్' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 29న నిర్వహించే చలో మైదాన్ ర్యాలీ విజయవంతం చేయాలని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు కోరారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వివిధ క్రీడా సంఘాల బాధ్యులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో యువత, క్రీడాకారులు, అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా స్టేడియంలో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు. అనంతరం వివిధ క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించిన జిల్లా క్రీడాకారులకు సన్మానించనున్నట్లు చెప్పారు. సమావేశంలో గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి, స్వామి, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గుస్సాడి నృత్యప్రదర్శనలో ఆదివాసీ యువకులు

అంబరాన్నంటిన జానపద సంబురం

ప్రపంచ జానపద దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం నిర్వహించిన జానపద సంబురాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు తరలివచ్చి ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్యంగా గుస్సాడి, థింసా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తోటి కళాకారులు కిక్రి వాయిద్యాలతో ఆలపించిన గీతం అలరించగా, యక్షగానం, బుర్రకథ గత జ్ఞాపకాలను గుర్తు చేశాయి. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతరించిపోతున్న జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. పల్లె ప్రజల జీవనానికి జానపదాలతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. అనంతరం పలువురు కళాకారులను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డీపీఆర్వో విష్ణువర్ధన్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు శేఖర్, సంఘం నాయకులు పాల్గొన్నారు. -కైలాస్‌నగర్



కిక్రీ వాయిద్య ప్రదర్శనలో తోటి కళాకారులు



కళాకారిణిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

ప్రాణం తీస్తున్న వేగం

- ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఓ మైనర్ బాలుడు స్పోర్ట్స్ బైక్‌పై అతివేగంగా వచ్చి మావలకు చెందిన ఓ వ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో సదరు వ్యక్తి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో మృతిచెందాడు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. అయితే ప్రమాదానికి కారకుడైన మైనర్‌తో పాటు ఆయన తండ్రిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- ఆదిలాబాద్‌లోని డైట్ మైదానం పక్కన ఓ యువకుడు స్పోర్ట్స్ బైక్‌తో స్టంట్స్ చేస్తున్నాడు. అతడి స్నేహితులు వీడియో చిత్రీకరిస్తున్న క్రమంలో వేగంగా దూసుకొచ్చిన బైక్ ఓ చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడి తలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు కళ్లెదుటే మృతిచెందడాన్ని ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోయింది.
- ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డుకు చెందిన ఓ యువకుడు మావల సమీపంలోని జాతీయ రహదారిపై బైక్‌పై స్టంట్స్ చేస్తూ అతివేగంగా నడిపాడు. ఈ క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన కాళ్లు, చేతులు విరిగిపోయి ప్రాణాలతో కొట్టుమిట్టాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. జిల్లాలో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

- బైక్‌లతో మైనర్లు హల్‌చల్
- రాత్రివేళలో రోడ్లపై స్టంట్లు
- అమాయకులను బలిగొంటూ..
- తనువు చాలిస్తున్న ఘటనలెన్నో..
- కుటుంబాల్లో తీరని విషాదం
- తల్లిదండ్రులపైనా తప్పని కేసులు



ఆదిలాబాద్‌టౌన్: తల్లిదండ్రుల అతి గారాబం పిల్లల ప్రాణాల మీదికొస్తోంది. కొంత మంది పేరెంట్స్ తమ పిల్లలకు స్పోర్ట్స్ బైక్‌లు కొనుగోలు చేసివ్వడంతో వారు రోడ్లపై స్టంట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతుండడంతో కొన్ని సంఘటనల్లో పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. స్నేహితులతో బైక్ రైడింగ్ చేయడం, గల్లీలు, రోడ్లపై ఇష్టారీతిన వేగంగా నడుపుతూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను సైతం గాలిలో కలిపేస్తున్నారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో పెద్ద దిక్కును కోల్పోతుండడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం చోటు చేసుకుంటున్నాయి. దీన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసుశాఖ మైనర్ ద్వారా ప్రమాదాలు జరిగితే వారి తల్లిదండ్రులపై కేసులు పెడుతున్నారు. ఇతరులు వారికి వాహనాలు ఇస్తే వారిపై సైతం కేసులు పెట్టేందుకు వెనుకాడటం లేదు. అయితే చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్న చందంగా మారుతుంది తల్లిదండ్రుల పరిస్థితి.

రోడ్డుపై రయ్.. రయ్

మైనర్లతో పాటు చాలా మంది యువకులు రోడ్లపై రయ్.. రయ్ మంటూ అతివేగంతో వాహనాలు నడుపుతున్నారు. స్పోర్ట్స్ బైక్‌లు, బుల్లెట్, ఇతర ద్విచక్ర వాహనాలతో చప్పుడు చేస్తూ జనం గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. ఈ శబ్ధం కారణంగా చాలా మంది అవస్థలు పడుతున్నారు. చూసి ఊరుకోవడం తప్పితే చేసేదేమి లేక మిన్నకుండిపోతున్నారు. నిబంధనల ప్రకారం ఏదైన వాహనం 95 నుంచి 112 డెసిబుల్స్ శబ్ధం మించకూడదు. అయితే వాహనాలకు వచ్చిన సైలెన్సర్లను తొలగించి భారీ శబ్ధం వచ్చే వాటిని అమర్చుకుంటున్నారు. దీంతో దారిపొడవున వెళ్లే వాహనదారులు, పాదాచారులకు అవస్థలు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో కొంతమంది యువకులు గుడిహత్నూర్ మండలంలోని సీతాగోంది నుంచి మావల, చాందా వరకు గల జాతీయ రహదారిపైన స్టంట్లు చేస్తున్నారు. అర్ధరాత్రి ఆదిలాబాద్ పట్టణంలో సైతం అతివేగంగా బైక్‌లు నడుపుతూ ప్రజలను ఇక్కట్లకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో మైనర్లతో పాటు తల్లిదండ్రులపై సైతం పోలీసులు కేసులు నమోదు చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రమాదాలు జరిగినప్పుడే హల్‌చల్..

ప్రమాదాలు సంభవించినప్పుడే పోలీసు, రవాణ శాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మైనర్లు వాహనాలు నడుపుతున్నప్పటికీ పట్టించుకోక పోవడంతో జిల్లా కేంద్రంలో వీరి ఆగడాలు మితి మీరుతున్నాయి. వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించడమే తప్పా వారికి అవగాహన కల్పించడం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే లైసెన్స్ తీసుకొని వాహనాలు నడిపించాల్సి ఉంటుంది. కానీ జిల్లా కేంద్రంలో వయస్సుతో సంబంధం లేకుండా మైనర్లు వాహనాలు తీసుకొని రోడ్లపై వేగంగా దూసుకెళ్తున్నారు. గతంలోనూ ఓ మైనర్ బాలుడు కిసాన్ చౌక్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సైను ఢీకొట్టడంతో ఆయన తీవ్ర గాయాల పాలైన విషయం విధితమే. ఆ బాలుడు పదో తరగతి చదువుతుండటం గమనార్హం. వార్షిక పరీక్షల ప్రారంభానికి ఒక రోజు ముందే ఈ ఘటన చోటు చేసుకోవడంతో పోలీసులు మానవతాదృక్పదంతో అతడిని వదిలిపెట్టారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులే..



తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. 18 ఏళ్లు నిండి లైసెన్సు కలిగిన తర్వాతే బైక్‌లు ఇవ్వాలి. లేకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు వారితో పాటు తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా ఇతరులకు వాహనాలు ఇచ్చిన సమయంలో కూడా ప్రమాదాలు జరిగితే వాహన యజమానులపై కేసులు పెడతాం. ఇటీవల బస్టాండ్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ప్రమాదానికి కారకుడైన మైనర్‌తో పాటు ఆయన తండ్రిపై కూడా కేసు నమోదు చేశాం.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

తేలుతున్న లెక్క

- జిల్లాలో సాగు భూముల సర్వే
- రైతుల స్థితిగతులపై అధ్యయనం
- తుది దశకు తొలివిడత వ్యవసాయ గణన

జిల్లాలో..

భూ విస్తీర్ణం: 5.65 లక్షల ఎకరాలు

మొత్తం రైతులు:1.50లక్షల మంది



వ్యవసాయ గణనలో పాల్గొన్న ఏఈవో

కైలాస్‌నగర్: రైతుల జీవన స్థితిగతులు, సాగు భూముల స్వభావాన్ని నిర్ధారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లకోసారి వ్యవసాయ గణన (అగ్రికల్చర్ సెన్సెస్) చేపడుతుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ముఖ్య ప్రణాళిక, వ్యవసాయశాఖలు సంయుక్తంగా ఈ సర్వే నిర్వహిస్తున్నాయి. 2015–16లో వ్యవసాయ గణన సర్వే చేపట్టగా తర్వాత 2021లో నిర్వహించాల్సి ఉంది. పలు కారణాలతో వాయిదా వేస్తూ వచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కావడంతో జిల్లాలో సంబంధిత శాఖలు సర్వేకు శ్రీకారం చుట్టాయి. ఏఈవోలు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి సాంకేతిక విధానంలో రైతుల వారీగా వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నెలాఖరులోపు సర్వే పూర్తయ్యే అవకాశం ఉంది.

రైతుల స్థితిగతులు తెలుసుకునేలా ..

రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా ప్రోత్సహిస్తున్నాయి. అన్నదాత ఆదాయ, వ్యయాలు అంచనా వేసి వారి స్థితిగతులు పక్కాగా తెలుసుకోవడమే ఈ గణన లక్ష్యం. సర్వే నివేదిక ఆధారంగా పంటల సాగులో కొత్త సంస్కరణలు తీసుకురావడం, సాగు రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించేందుకు తోడ్పడనుంది. అలాగే గ్రామస్థాయి నుంచి మండలం, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు వ్యవసాయ సాగు భూమి ఎంత ఉందనే లెక్క పక్కాగా తేలనుంది.

తుది దశకు సర్వే

భూ కమతాల సర్వేను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 5నుంచి జిల్లాలో ప్రారంభమైన తొలివిడత సర్వే ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలో 505 గ్రామాలుండగా ఇందులో ఇప్పటి వరకు 88 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. 416 గ్రామాల్లో కొనసాగుతుండగా ఒక గ్రామంలో పెండింగ్‌లో ఉంది. ఏఈవోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతుపేరు, తండ్రి పేరు, గ్రామం, భూ విస్తీర్ణం, సాగు చేస్తున్నారా లేదా, భూమి సాగు చేసే గ్రామంలో ఉంటున్నారా లేక వేరే గ్రామంలో ఉంటున్నారా, సొంతంగా సాగు చేస్తున్నారా, కౌలు, మహిళా రైతుల వివరాలు సేకరిస్తున్నారు. గతంలో చేతిరాతల ద్వారా ఈ సర్వే నిర్వహించగా ప్రస్తుతం సాంకేతిక విధానంలో ధరణి పోర్టల్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. రెండో దశలో ముఖ్య ప్రణాళిక శాఖ నిర్దేశించిన టైమ్‌లీ రిపోర్టింగ్ ఆఫ్ అగ్రికల్చర్ స్టాటిస్టికల్ నివేదిక ద్వారా సర్వే చేయనున్నారు. మూడో విడతలో వ్యవసాయ సాగు వ్యయం, యంత్రీకరణ వంటి వివరాలు సేకరించనున్నారు. ప్రస్తుతం తొలి విడత సర్వేకే ప్రభుత్వం ఆదేశించింది. మిగతా రెండు విడతల సర్వేలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్నారు.

ఈ నెలాఖరులోగా పూర్తి ..

వ్యవసాయ గణనను జిల్లాలో ముమ్మరంగా నిర్వహిస్తున్నాం. ఏఈవోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేస్తాం. భూ కమతాల స్వభావంతో పాటు రైతుల స్థితిగతులను నిర్ధారించేందుకే ప్రభుత్వాలు ఈ సర్వే నిర్వహిస్తున్నాయి. నివేదిక ఆధారంగా రైతుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టనున్నాయి.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

కార్యకర్తలు సమష్టిగా పని చేయాలి

- అర్ని ఎమ్మెల్యే సందీప్ దుర్వే



ర్యాలీలో పాల్గొన్న అర్ని ఎమ్మెల్యే దుర్వే, పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్: రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని మహారాష్ట్ర అర్ని ఎమ్మెల్యే సందీప్ దుర్వే అన్నారు. అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని రామ్‌లీలా మైదాన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ వినాయక చౌక్, దేవిచంద్ చౌక్, కలెక్టరేట్ చౌక్ నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకు సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జోగు రవి, దినేష్ మటోలియా, ప్రవీణ్ రెడ్డి, విజయ్, మయూర్ చంద్ర, జ్యోతిరెడ్డి, చిట్యాల సుహాసినిరెడ్డి పాల్గొన్నారు.

'రాష్ట్ర ఖజానాను ఖాళీచేసిన బీఆర్ఎస్..'

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని మహారాష్ట్ర అర్ని ఎమ్మెల్యే సందీప్ దుర్వే అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను, నిధులను తనవిగా చెప్పుకుంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటుందన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా తర్నం బ్రిడ్జ్ కూలిపోయే దశకు చేరుకొని ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అలాగే రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, జ్యోతి రెడ్డి, నగేష్, విజయ్, జ్యోతి పాల్గొన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో అక్రమాలను ప్రోత్సహిస్తున్న డీఈవోపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ జేఏసీ నాయకులు ముజాఫర్ హుస్సేన్, శ్రీకాంత్, జలందర్, నరేందర్, గోపీకృష్ణ, రామగిరి శివకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని టీయూటీఎఫ్ సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదిలాబాద్ డీఈవో నియామకం అయినప్పటి నుంచి విద్యాశాఖ గాడి తప్పిందని పేర్కొన్నారు. డీఎస్ఈ ఇచ్చిన మార్గదర్శకాలు పక్కనబెట్టి తనకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు, సర్దుబాటులో అక్రమాలు చోటు చేసుకున్నాయని విమర్శించారు. క్రీడా పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులను కేటాయించారని పేర్కొన్నారు. వెంటనే ఓరల్ డిప్యూటేషన్ రద్దు చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుల సంఘం, టీయూటీఎఫ్, డీటీఎఫ్, ఎస్జీటీయూ, టీఎస్‌పీటీఏ, టీపీయూఎస్, టీఆర్‌పీఎఫ్, ఎస్టీయూ, పేటా సంఘాల బాధ్యులు శ్రీనివాస్, నాగేందర్, దిలీప్, ఆకాశ్, వెంకటేశ్, మహ్మద్ రియాజ్, సురేందర్ రెడ్డి, ఎం.శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చెస్‌తో మేధాశక్తి పెంపొందుతుంది

- మంచిర్యాల అదనపు కలెక్టర్ బి.రాహుల్



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలటౌన్: చెస్‌తో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందించవచ్చని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. చెస్‌తో చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బిజ్జు, చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ సిరాజ్ ఉర్ రెహమాన్, ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనకయ్య, ఆసిఫాబాద్ అధ్యక్షుడు కోట సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఉద్యోగి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిందని మావల పోలీస్ స్టేషన్ ఎస్సై రహిమతుల్లా తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..టీచర్స్ కాలనీకి చెందిన ఉద్యోగి ఈ నెల 12న నిడ్స్ హోమ్ ఆఫర్ కింద ఓ వ్యక్తి వాట్సప్ ద్వారా మేసేజ్ చేశారు. దీంతో ఆమె ముందుగా రూ.3వేలు చెల్లించింది. మరోసారి మరికొంత పేమెంట్ చేయాలని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో రూ.30వేలు చెల్లించింది. మొత్తం రూ.33వేలు చెల్లించగా ఎలాంటి వస్తువులు రాలేదు. మోసపోయినట్లు గ్రహించిన ఆమె ఆదివారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన యువతి శనివారం రాత్రి అదృశ్యమైనట్లు ఎస్సై రహిమతుల్లా తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. కేఆర్కే కాలనీకి చెందిన 16 ఏళ్ల యువతి కుటుంబ సభ్యులు ఆదివారం వేకువ జామున చూడగా కనిపించలేదు. అలాగే ఇంట్లోని రెండు సెల్ ఫోన్‌లతో పాటు రూ.5వేలు నగదు, యువతి బట్టలు కనించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎదులాపురం: మహారాష్ట్ర కిన్వట్ తాలుకా శనివార్‌పేట్‌కు చెందిన రాథోడ్ విజయ్(37) రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. టుటౌన్ హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం... రాథోడ్ విజయ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పని లేక తరచూ మద్యం సేవిస్తూ ఇంట్లో వాళ్లతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈనెల 25న కుటుంబీకులతో గొడవ పడి పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు అతడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆవుపైకి దూసుకెళ్లిన కారు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐబీ ప్రాంతంలో గుర్తు తెలియని కారు ఆవు పైనుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆవు కారు టైర్లలో ఇరుకుపోయింది. అయినా కారును ఆపకకుండా ఈడ్చుకెళ్లడంతో కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని సొంత ఖర్చులతో ఆవుకు వైద్యం చేయించారు.

పాముకాటుతో ఎద్దు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని మాన్కపూర్ గ్రామంలో ఎద్దు పాముకాటుకు గురై మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మాన్కపూర్ గ్రామానికి చెందిన కుంటల్‌వాడ్ అడేల్లు ఆదివారం తన ఎద్దులను తీసుకుని పంట పొలంలోకి వెళ్లాడు. పశుగ్రాసం మేస్తున్న సమయంలో ఎద్దును పాము కాటువేసింది.

బడి.. భవితకు బాసటగా

- విద్యార్థుల సంఖ్య పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు
- స్వచ్ఛంద సంస్థల సహకారం.. సొంతంగా పనులు
- సాంకేతికత సాయంతో ప్రైవేటుకు దీటుగా..
- మూతబడే స్థితి నుంచి.. నో అడ్మిషన్ స్థాయికి..
- పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దిన రెబ్బన్‌పల్లి, నిపాని హెచ్‌ఎంలు
- వారి శ్రమకు జాతీయస్థాయి గుర్తింపు
- ఉత్తమ ఉపాధ్యాయులుగా అర్చన, సంతోష్‌కుమార్

విద్యార్థుల భవితను తల్లిదండ్రుల తర్వాత తీర్చిదిద్దేది గురువులే. ఉత్తమ ఉపాధ్యాయుడి చేతిలో పడిన విద్యార్థి భవిష్యత్ ఉజ్వలమే. ప్రాథమిక స్థాయిలోనే చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందిస్తూ.. వారిలో సృజనాత్మకత వెలికితీస్తూ రాణించేలా చొరవ చూపుతారు. వ్యక్తిగత శ్రద్ధ, పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం.. ఎంతో మంది గురువులను ఉత్తమంగా నిలబెడుతుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నుగూరి అర్చన, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బిదోడ్కర్ సంతోష్‌కుమార్ కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు. సాంకేతికత అందిపుచ్చుకుని స్వచ్ఛంద సంస్థల సహకారం.. వ్యక్తిగత శ్రద్ధతో తాము పనిచేస్తున్న పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దారు. ప్రైవేటుకు దీటుగా ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని విద్యాబోధన చేస్తున్నారు. ఒక దశలో మూతపడే స్థాయికి చేరిన పాఠశాలలను.. నో అడ్మిషన్ స్థాయికి చేర్చారు. వీరి శ్రమకు ఇప్పటికే అనేక పురస్కారాలు దాసోహమయ్యాయి. తాజాగా జాతీయ ఉత్తమ పురస్కారం సైతం వీరిని వరించింది. తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా ఇద్దరూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులే కావడం గమనార్హం. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు వీరు.

– దండేపల్లి/తాంసి



విద్యార్థులకు బోధనలో భాగంగా ఫీల్డ్ ట్రిప్‌నకు తీసుకెళ్లిన అర్చన

34 నుంచి 200 వరకు చేరిన విద్యార్థుల సంఖ్య

2000 సంవత్సరం నవంబర్‌లో డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించిన అర్చన 2013లో దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చింది. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థులు 34 మంది మాత్రమే ఉన్నారు. గ్రామానికి చెందిన సంగనభట్ల రాజేంద్రప్రసాద్, వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలో వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు కూర్చునేందుకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, డిజిటల్ తరగతులు, తాగునీటి కోసం శుద్ధజల ప్లాంటు, కంప్యూటర్ తరగతులు, తదితర వసతులు కల్పించారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల తల్లిదండ్రుల దృష్టి ఈ పాఠశాలపై పడడంతో విద్యార్థులను చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో 2018 నుంచి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200కు చేరుకుంది. ప్రస్తుతం పాఠశాలలో అడ్మిషన్ పొందేందుకు తీవ్ర పోటీ ఉంటోంది.

పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలు

పాఠశాల అభివృద్ధికి ప్రతినెల సొంతగా రూ.30 వేలు ఖర్చు చేస్తోంది. సమీప గ్రామాల నుంచి వచ్చే గిరిజన విద్యార్థులకు ఆటోచార్జీలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ప్రైవేటుగా ఉపాధ్యాయులను నియమించి వేతనాలు తానే చెల్లిస్తున్నారు. విద్యార్థులకు ఫీల్డ్‌ట్రిప్ నిర్వహించడం, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కరాటేలో శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు. ఆమె చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం 2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా 2019లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా 2023లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.

సంతోషంగా ఉంది



దాతల సహకారం, తోటి ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు అందుకున్నా. వాటన్నింటికంటే భిన్నంగా ఈసారి జాతీయ స్థాయికి ఎంపిక కావడం, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకునే అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది.

– నుగూరి అర్చన, హెచ్‌ఎం, రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల, దండేపల్లి, మంచిర్యాల



డిజిటల్ తెరపై పాఠాలను బోధిస్తున్న సంతోష్ కుమార్

అధునాతన బోధనతో..

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బిదోడ్కర్ సంతోష్‌కుమార్ పాఠశాలలో నూతన సాంకేతికత పద్ధతులతో విద్యాబోధన చేస్తున్నారు. డిజిటల్ తరగతులు, ప్రత్యేక యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ప్రత్యేకంగా గూగుల్ క్లాస్ రూమ్ యాప్ సాయంతో యూట్యూబ్ ఛానల్ పెట్టారు. దీనిద్వారా విద్యార్థులకు నిత్యం ఆన్‌లైన్ ద్వారా తరగతులు బోధించాడు. నిత్యం తరగతి గదిలో బోధించే పాఠ్యాంశాలను రోజు వారీగా యూట్యూబ్‌లో వీడియోలను చేర్చేవారు. పాఠశాలలో బోధించిన పాఠాలను విద్యార్థులు ఇంటివద్ద వినే అవకాశం కల్పించారు. బోధనతో పాటు ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ సైతం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు.

డిజిటల్ తరగతులు

పాఠశాలల్లోని డిజిటల్ తరగతి గదుల్లో ఉన్న పెద్ద స్క్రీన్‌పై ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే పద్ధతిలో డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పాటు గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో అదనపు గదులు, మూత్రశాలల నిర్మాణం చేపట్టారు. డ్రాపౌట్స్ లేకుండా గ్రామస్తులకు చదువుపై అవగాహన కల్పించారు. ప్రతిభ పరీక్షల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సైతం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ...వినూత్న ఆలోచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుదలకు విశేష కృషి చేస్తున్నారు. డిజిటల్ పాఠాల తయారీ, రిసోర్స్ పర్సన్‌గా తోటి ఉపాధ్యాయులకు సైతం శిక్షణ ఇచ్చారు. 2011లో బిదోడ్కర్ సంతోష్‌కుమార్ పాఠశాలకు బదిలీపై వచ్చిన సమయంలో విద్యార్థుల సంఖ్య 135 ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 220కు చేరుకుంది.

అందరి కృషి ఫలితమే



జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు రావడంతో నాపై మరింత బాధ్యత పెంచింది. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతోనే అవార్డు వరించింది.ఆదిలాబాద్ జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్న.

– బిదోడ్కర్ సంతోష్ కుమార్, నిపాని ప్రాథమికోన్నత పాఠశాల

సమ్మె బాటలో.. సమగ్రశిక్ష ఉద్యోగులు

- మూడు రోజులుగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా
- అధికారులు, పోలీసులను కలిసి వినతిపత్రాలు అందజేత



ఆసిఫాబాద్ డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల

ఎస్ఎస్ఏ ఉద్యోగుల వివరాలు

ఆదిలాబాద్: 607	మంచిర్యాల: 513
కుమురం భీం: 473	నిర్మల్: 424

ఇవి డిమాండ్లు..
- సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి
- అప్పటివరకు ఎంటీఎస్(మినిమం టైం స్కేల్) అమలు చేయాలి
- ఉద్యోగులందరికీ 10 లక్షల జీవిత, ఆరోగ్య బీమా చెల్లించాలి
- ఎస్ఎస్ఏ మృతిచెందితే కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

కెరమెరి(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడం లేదని సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. నేటి నుంచి మూడు రోజులపాటు కలెక్టరేట్ల ఎదుట ధర్నా, రిలేదీక్షలు నిర్వహించనున్నారు. మొదటి రోజు ధర్నాతోపాటు, 29, 30న 48 గంటల రిలే దీక్షలు చేపట్టనున్నారు. జిల్లాల బాధ్యులు, పోలీస్, జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.

ఎస్పీడీ కార్యాలయం ముట్టడితో..

ఈనెల 16న రాష్ట్ర విద్యాశాఖ ఎస్పీడీ కార్యాలయం ముట్టడి విజయవంతంతో ఉద్యోగులంతా ఏకమయ్యారు. సమగ్ర శిక్షలో క్లస్టర్ స్థాయి రిసోర్స్ పర్సన్లు, ఎమ్మార్సీలో ఎంఐఎస్ కోర్డినేటర్లు, సీసీవోలు, జిల్లా కేంద్రాల్లో డీపీవో సిబ్బంది, కేజీబీవీల్లో, యూఆర్ఎస్‌లో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, పీటీఐ, మెసెంజర్లు, అటెండర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ తదితరులు రాష్ట్రవ్యాప్తంగా 22 వేల మంది ఉన్నారు.

ఉద్యమాలు చేపడుతాం



ఎస్ఎస్ఏ ఉద్యోగులపై ప్రభుత్వానికి కనికరం లేదు. అన్ని అర్హతలున్నా రెగ్యులరైజ్ చేయాలి. అప్పటివరకు ఎంటీఎస్ ఇవ్వాలి. తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు దిగుతున్నాం. పట్టించుకోకపోతే రాష్ట్రస్థాయిలో ఉద్యమాలు చేపడుతాం. సమ్మెకు సైతం వెనుకాడం.

– పదాల రవీందర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి

వాహనం ఒకరిది.. చలాన్లు మరొకరికి



ఉట్నూర్‌లో డూప్లికేట్ నంబర్‌తో బైక్



తప్పుడు నంబర్‌తో నిర్మల్ జిల్లాలో..



వాహనదారుడికి పడిన చలాన్లు

ఆదిలాబాద్‌టౌన్: కొంతమంది వాహనదారులు పోలీసుల చలాన్ల నుంచి తప్పించుకునేందుకు జిమ్మిక్కులు చేస్తున్నారు. తమ వాహనానికి ఇతరుల వాహనాలకు సంబంధించిన నచ్చిన నంబర్లు పెట్టుకుంటున్నారు. రోడ్లపై తిరిగే సమయంలో పోలీసులు ఈ వాహనాలకు చలాన్లు వేసినప్పుడు ఇతరులకు మెస్సేజ్‌లు వెళ్తున్నాయి. దీంతో ఆ వాహనదారులు హైరానా చెందుతున్నాడు. తమ వాహనం ఇంటి వద్దే ఉన్నప్పటికీ చలాన్లు రావడం ఏమిటని ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటిదే మావల మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు మైసమాధవ్‌కు చలాన్ల మెస్సేజ్‌లు వస్తున్నాయి. ఒకట్రెండు కాకుండా.. ఏకంగా రూ.1805ల చలాన్లు రావడంతో ఆయన అవాక్కయ్యాడు. తన బైక్ నంబర్ (ఏపీ01ఆర్) ఉండగా అదే నంబర్‌తో ఓ ఎక్సల్ వాహనం నిర్మల్ జిల్లాలో తిరుగుతుండగా, అలాగే ఉట్నూర్‌లో మరో బైక్ వాహనదారుడు తన బైక్ నంబర్లను పెట్టుకొని ఉన్నట్లు తెలిసింది. తనకు చలాన్ రూపంలో వచ్చిన ఫొటోలు, లొకేషన్ ఆధారంగా వీటిని కనుగొన్నట్లు తెలిపాడు. గతంలో నిర్మల్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఇటీవల మళ్లీ చలాన్లు పడుతున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు.

పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్య

నేరడిగొండ: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన బామని కిషన్ (38) తనకున్న రెండెకరాలతో పాటు మూడెకరాలు కౌలుకు తీసుకొని ఐదెకరాలు సాగు చేస్తున్నాడు. పత్తి, సోయా, మక్క పంటలు వేశాడు. రూ.5లక్షల అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ఆటో బోల్తా ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్యులు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడిన సంఘటనలో ఏడుగురికి గాయాలు కాగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని హీరాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. ప్రత్యేక సాక్షుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్ మండలంలోని వాగాపూర్ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు ఆటోలో ఉట్నూర్ మండలంలోని పేర్కగూడ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ ప్రధాన రహదారిపై ఎదురుగా కుక్కలు రావడంతో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మర్సుకోల హనుమంత్‌రావ్, మర్సుకోల లక్ష్మిబాయితో పాటు మర్సుకోల సేవంతబాయిలకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్, మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. హనుమంత్‌రావ్ పరిస్థితి విషమంగా ఉందని 108 పైలెట్ ఆత్రం అశోక్ తెలిపారు.

ప్రాణాలు తీసిన అతివేగం

నిర్మల్ జిల్లా సమీపంలోని జాతీయ రహదారులపై ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో అతివేగంగా దూసుకొచ్చిన లారీ మూలమలుపు వద్ద నిలిపిఉన్న టిప్పర్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో ఘటనలో డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి ఎదురుగా వచ్చిన లారీని ఢీకొంది. అంతటితో ఆగకుండా మరో లారీని ఢీకొనగా అదే లారీకింద వ్యాన్ డ్రైవర్ ఎగిరిపడి మృతిచెందాడు. ఈ సంఘటనలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

- రక్తమోడిన జాతీయ రహదారులు
- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత
- టిప్పర్‌ను లారీ ఢీకొట్టినఘటనలో ముగ్గురు
- మరో ఘటనలో డీసీఎం వ్యాన్ డ్రైవర్ మృతి



లాల్‌సింగ్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న యువకులు

మృత్యుఒడికి ముగ్గురు..

మామడ: లారీ రూపంలో వచ్చిన మృత్యువు ముగ్గురి ప్రాణాలు కబలించింది. దీంతో ఆ గిరిజన నిరుపేద కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాలలోకి వెళ్తే... మండలంలోని పులిమడుగు గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నేరడిగొండ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కుమ్రం రాజేంద్రప్రసాద్(31), బందంరేగడి గ్రామానికి చెందిన లాల్‌సింగ్(45), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాలోని బుద్ద రామసముద్రంనకు చెందిన లారీ క్లీనర్ షేక్ ఖాసీం పీర(43) మృతిచెందారు.

ఎలా జరిగింది...

కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పులిమడుగు సమీపంలోని జాతీయ రహదారిపై టిప్పర్ ద్వారా మట్టితో రోడ్డు పక్కన గుంతలకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో టిప్పర్ బోల్తా పడింది. టిప్పర్‌ను నడుపుతున్న లాల్‌సింగ్‌తో పాటు టిప్పర్‌లోని కుమ్రం రాజేంద్రప్రసాద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. కుమ్రం రాజేంద్రప్రసాద్ తండ్రి కుమ్రం జంగు నేరడిగొండ మండలంలోని లకంపూర్(జి) గ్రామ సర్పంచ్. రాజేంద్రప్రసాద్ జాతీయ రహదారి నిర్వహణ కంపెనీలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బందంరేగడి గ్రామానికి చెందిన లాల్‌సింగ్ కొన్ని రోజులుగా ఈ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

మూలమలుపు.. అతివేగం

ప్రమాదం జరిగిన స్థలం వద్ద మూలమలుపు ఉంది. ఆదిలాబాద్ నుంచి వచ్చే వాహనాలు ఈ గుట్ట ప్రాంతంలో 40కిలో మీటర్ల వేగంతో వెళ్లాల్సి ఉన్నప్పటికీ మూలమలుపుతో పాటు రోడ్డు పల్లంగా ఉండటంతో వేగం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రమాదంలో గాయపడిన లారీ క్లీనర్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రమాద స్థలంలో లారీ

లారీలను ఢీకొట్టిన డీసీఎం

నిర్మల్ రూరల్: అతివేగం.. ఆపై నిర్లక్ష్యం... అజాగ్రత్తగా డ్రైవింగ్ చేసి నిండుప్రాణం తీసుకున్నాడు డీసీఎం డైవర్. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికుల కథనం ప్రకారం.... మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌కు చెందిన డీసీఎం వాహనం నిర్మల్ రూరల్ మండలం చిట్యాల బ్రిడ్జి పైన సిమెంట్ లోడుతో భైంసా వైపు వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొట్టింది. అనంతరం కంట్రోల్ తప్పి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ సమయంలో వ్యాన్ డ్రైవర్ మోహిత్‌పాల్ (44) రెండో లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మొదటి లారీ డ్రైవర్ షేక్ అజీజ్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు శ్రమించి బయటకు తీసుకొచ్చి జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి డీసీఎం డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే కారణమని పోలీసులు పేర్కొన్నారు. మోహిత్‌పాల్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కందువ జిల్లా అట్టర్ గ్రామస్తుడిగా గుర్తించారు. బ్రిడ్జిపై మూడు వాహనాలు నిలిచిపోవడంతో రెండువైపులా ట్రాఫిక్ స్తంభించింది. భైంసా, మహారాష్ట్ర వైపు వెళ్లే వాహనాలను జిల్లా కేంద్రంలోని సిద్దాపూర్ మీదుగా తరలించారు. రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు అతికష్టం మీద ఢీకొన్న వాహనాలను పక్కకు తొలగించి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు



మోహిత్ పాల్ మృతదేహం